# "చిల్లరవుందా?"

లజ్ కార్నర్‌లో కామధేను థియేటర్ ఎదురుగా వున్న బస్ స్టాప్‌లో నిలబడి 12బి. బస్‌కోసం ఎదురు చూస్తున్నాను.

మద్రాస్ నాకు కొత్త. అంతకు వారంముందే నెల్లూరు నుంచి బదిలీ అయివచ్చి మద్రాస్ బ్రాంచ్‌లో జాయినయాను.

బస్‌స్టాప్ అట్టే రద్దీగాలేదు. కొద్ది దూరంలో నిలబడివున్న నలుగురిలో ఒకడు నా దగ్గరికి వచ్చాడు.

కొద్దిగా సంశయిస్తూనే నా చేతిలోని తెలుగు వారపత్రిక చూసి తెలుగులో అడిగాడు.

"సార్, ఇరవై రూపాయల చిల్లరవుంటే ఇస్తారా?"

అతను షర్ట్ జేబులోంచి ఓ కొత్త ఇరవై రూపాయల నోటు బయటకి నాకు అందించాడు.

పేంట్ కుండే ముందుజేబులోంచి పర్స్‌తీసి అందులో ఇరవై రూపాయల నోటువుంచి రెండు పది రూపాయల నోట్లు తీసి అందించాను.

అతను తీసుకోకుండా నా వంకే చూస్తున్నాడు

"తీసుకోండి. అయిదులు కావాలా?"

అతను పర్స్‌లోని నోట్లవంక చూసి తమిళంలో ఏదో అన్నాడు.

"నాకు అరవం రాదు. తెలుగులో చెప్పండి" అన్నాను కొద్దిగా చిరాకుగా.

"ఇరవై ఇస్తున్నారే ?" ఈసారి ఇంగ్లీషులో మాట్లాడాడు.

"మరి ఎంత ఇవ్వాలి ?" ఆశ్చర్యంగా అడిగాను.

"నేనిచ్చింది వంద రూపాయలనోటు."

"వందా ?" కాదు."

"మీ జేబులో సరిగ్గా చూడండి. వంద జేబులోనే వుంటుంది."

అరవంలో గట్టిగా అరవసాగాడు అతను.

బస్‌స్టాప్‌లో నిలబడ్డ ఇద్దరు మా దగ్గరకి వచ్చారు. ఒకతను అర వంలో నన్నేదో అడిగాడు.

"నాకు అరవం రాదు. ఇతను ఇరవై రూపాయల నోటిచ్చి చిల్లర ఇమ్మన్నాడు. ఇప్పుడు వంద ఇచ్చానని అబద్ధం ఆడుతున్నాడు" చెప్పాను. ఇంగ్లీషులో అతనికి.

"ఎంత ఇచ్చావ్ ?" అడిగారు అతన్ని ఆ ఇద్దరూ అరవంలో.

"వంద" చెప్పాడు అతను.

అతని కాకీ బట్టలు మాసిపోయి వున్నాయి. అక్కడక్కడా ఆయిల్ మరకలు అంటుకుని వున్నాయి. ఏదో ఆటోమొబైల్ కంపెనీలో క్లీనర్‌గా పనిచేస్తున్నాడని అర్థమవుతుంది, అతని ఆకారం చూస్తే. గడ్డంగీసి ఆయి దారు రోజులయినట్లుంది.

"ఆయన అబద్ధం ఆడుతాడా ? అసలు నీ దగ్గర వందనోటు ఎలా వచ్చింది ?"

ఇంకొకడు గద్దించి అడిగాడు.

"ఇరవై ఇస్తారు. తీసుకో" తీర్పు చెప్పినట్లుగా చెప్పాడు ఆ ఇద్ద రిలో ఒకడు.

వాడు తల అడ్డంగా వూపి గట్టిగా అరవంలో అరవసాగాడు మళ్ళీ.

నా బస్ వచ్చి ఆగింది కాని ఎక్కలేదు. ఎరక్కపోయి ఇరు క్కున్నానేమిటా అనిపించింది నాకు.

"పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్ళండి వంప ఇచ్చానని పట్టుబడుతున్నాడు" ఒకరు సలహా ఇచ్చారు నాకు.

ఇంతలో ఓ నలభై అయిదేళ్ళతను గబగబా నడిచి వచ్చాడు. మా దగ్గరకి మలయాళంలో ఏదో గబగబా మాట్లాడాడు ఆ కాకీ రంగు బట్టలు ధరించిన వ్యక్తితో. వాడు దానికి జవాబు చెప్పాడు. నా వైపు చూపించి ఏదో చెప్పాడు.

వెంటనే అతను నా వైపు తిరిగి కొరకొరా చూస్తూ ఇంగ్లీష్‌లో అడిగాడు కోపంగా.

"సిగ్గులేదా, అమాయకుడిని చేసి మోసం చేయడానికి ?"

"జాగ్రత్తగా మాట్లాడండి. అసలు మీరెవరు అన్నాడు" ఇందాకటి ఇద్దరిలో ఒకడు.

"వీడు తెలియక వంద రూపాయలు ఇస్తే అది తీసుకుని ఇరవై అంటాడా ? వీడి వాలకం చూసి వీడి దగ్గర వంద ఎక్కడ వుంటుంది అనుకుని వుంటాడు. నా షాపులో పనిచేస్తున్నాడు. వంద ఇచ్చి ఖాళీ ఆయిల్ డ్రమ్ము కొని తీసుకురమ్మని పంపాను. మాంబళంలో వుంది మా షాపు."

వెంటనే ఆ ఇద్దరిలో ఒకడు నా వంక అనుమానంగా చూశాడు.

"నిజంగా వంద ఇస్తే ఇరవై అనుకుని వుంటారు. ఓసారి పర్సులో చూడండి" అన్నాడు ఇంగ్లీష్‌లో.

ఆ కాకీ బట్టలవాడు తన షాపు యజమానితో ఏదో చెప్పాడు. అతను నా వైపు తిరిగి అడిగాడు.

ఎందుకండి అబద్దాలు ఆడతారు. ఇస్త్రీ చేసిన బట్టలు తొడుక్కుని ఆఫీస్‌లో ఫాన్‌కింద కూర్చుని నెల నెలా జీతం తీసుకోవడం కాదు, ఆటో మొబైల్ వర్క్‌షాప్‌లో పనిచేయడం అంటే ఎడ్యుకేటెడ్ అయివుండీ సిగ్గులేదా ఇలా అన్యాయంగా డబ్బు సంపాదించడానికి ?"

అప్పటికే మా చుట్టూ చాలామంది గుమిగూడారు.

"పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళండి" అన్నారు ఎవరో నేనే దోషి అన్నట్లుగా.

"మర్యాదగా వాడి డబ్బు వాడికిచ్చేయ్" అన్నాడు ఒకడు నా భుజం మీద గట్టిగా చెయ్యివేసి, వాడూ ఏదో ఆటోమొబైల్ షాప్‌లో పనిచేసే వ్యక్తిలా కనిపించాడు.

పరిస్థితి నా చెయిదాటి పోయిందని గుర్తించాను.

పర్స్‌లోంచి వంద రూపాయల నోటుతీసి అందించాను ఆ కాకీ బట్టల వాడికి. దాన్ని తీసుకుని జేబులో పెట్టుకున్నాడు మలయాళంలో నన్ను తిడుతూ. అవి బూతులే అయివుంటాయనిపించింది.

అందరూ నన్నే చూస్తున్నారు. వాళ్ళందరి దృష్టిలో నేను మోస గాడినయ్యాను. అసలు మోసగాడు దొరబాబులా వెళ్ళిపోయాడు.

ఆ వందతో నా చెల్లెలికి చీర కొందామనుకుంటూ కొనకుండా వాయిదా వేస్తూ వస్తున్నాను.

మంచికిపోయి మంచి పాఠం నేర్చుకున్నాను. పది నిమిషాల తర్వాత వచ్చింది నా బస్ ఎక్కాను.

మర్నాడు మేనేజర్‌కి చెప్పాను లజ్ కార్నర్ బస్ స్టాప్‌లో జరిగిన సంగతి.

ఆయన పకపకా నవ్వి చెప్పారు.

"నెల్లూరు కాదిది మద్రాస్. మోసం జాస్తి. ఎవరినీ నమ్మకూడదు. నీ పాఠం ఖరీదు ఎనభై రూపాయలు. వాడు ఆటోమొబైల్ షాప్‌లో పని చేయటం, ఆ షాపు యజమాని సమయానికి రావటం, ఇద్దరూ వచ్చి ముందర మీ తరఫున తర్వాత వాడి తరఫున మాట్లాడటం ఇదంతా నాటకం.... పోలీసులు వాళ్ళకోసం వెదుకుతున్నారు. నన్ను కూడా ఇలాగే

మోసం చేశారు. నాకు అనుమానం వచ్చి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్ట్ చేస్తే తెలిసింది వాళ్ళు మోసగాళ్ళని.

చిన్నగా నిట్టూర్చాను.

*   *   *

రెండు పది రూపాయల నోట్లు లెక్కపెట్టి కౌంటర్‌లోంచి అందించాను అతనికి.

అందుకుని, వాటివంక ఎగా దిగా చూసి అడిగాడు.

"ఇరవై రూపాయలే ఇచ్చారే ?"

"మీరిచ్చింది ఇరవై యేగా ?"

"కాదు. వంద."

"వందా....ఇరవై అనుకుంటాను."

"కాదు వంద. సరిగ్గా చూడండి" తెలుగులో దబాయించాడతను నన్ను.

"కూర్చోండి. మొత్తం కేష్, క్లోజ్ చూస్తే తెలుస్తుంది."

గబగబా అతని ముందు కరెన్సీ నోట్లు లెక్కపెట్టసాగాను.

అతను నిలబడే తీక్షణంగా చూడసాగాడు నా వంక.

ఓ బ్లాంక్ క్రెడిట్ ఓచర్ మీద 'మేనేజర్ ఇరవై నోటిచ్చి వంద ఇచ్చానని దబాయించే మోసగాడు ఇక్కడికి వచ్చి దబాయిస్తున్నాడు నన్ను. పోలీసులని పిలవండి' అని రాసి పక్క పేమెంట్ కౌంటర్‌లోని కేషియర్‌కి ఇచ్చాను.

మేనేజర్ అతని దగ్గరికి నడిచి వచ్చి అడిగాడు అతని భుజం మీద తట్టి.

"ఏం కావాలి ?"

"వంద రూపాయలిచ్చి చిల్లర ఇమ్మంటే ఇరవై రూపాయల నోటే ఇచ్చానంటున్నాడు ఇతను" చెప్పాడు.

"ఇరవై యే ఇచ్చి వుంటావ్. వంద ఇస్తే ఇరవై అని ఎందు కంటాడు?" కరకుగా అడిగాడు మేనేజర్.

"కాదు వంద....మీరెవరు?"

"ఈ బేంక్ మేనేజర్‌ని. నీ వృత్తే ఇది కదా. ఇరవై రూపాయలకి చిల్లర అడిగి వంద ఇచ్చానని చెప్పి మోసం చేస్తావు నువ్వు."

అతని మొహం వెంటనే పాలిపోయింది. భయంగా చూస్తూ అన్నాడు.

"అబద్ధం."

"నెల క్రితం ట్రిప్లి కేన్‌లో నన్ను మోసం చేశావ్ మర్చిపోయావా? పదిహేను రోజుల క్రితం ఇతన్ని లజ్ కార్నర్‌లో మోసం చేశావ్. గుర్తుందా?"

"నాకు తెలియదు. నేను కాదు."

"పోలీసులకి ఫోన్ చేశాను ఓ అయిదు నిమిషాలాగు. వస్తున్నారు" అన్నాడు మేనేజర్ నవ్వుతూ.

భయంతో తెల్లగా పాలిపోయింది అతని మొహం.

"నేనసలు గుర్తే పట్టలేదు. ఇరవై ఇచ్చి వంద ఇచ్చాననేసరికి గుర్తొచ్చింది" చెప్పాను మేనేజర్‌కి నేను.

"ఇరవైకి చిల్లర ఇచ్చారా?" అడిగాడు నన్ను మేనేజర్.

"తీసుకోలేదు."

"ఇచ్చేయండి"

రెండు పదులు అందించాను అతనికి మాట్లాడకుండా తీసుకున్నాడు నన్ను మింగేసేలా చూస్తూ.

"నాకు ఓటీ పంపించి మంచి పని చేశావ్" మెచ్చుకున్నాడు మేనేజరు.

పోలీసులు తీసుకెళ్ళిపోయారు వాడిని.

* * *

ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళాక చెల్లాయ్‌తో చెప్పాను "త్వరగా తయారయితే బయటకి వెళదాం చీర కొంటాను."

"వంద ఎక్కడిది అప్పుచేశావా?" అడిగింది.

"ఉహూ పోయిన డబ్బు తిరిగి దొరికింది."

"రోడ్డు మీదా!" నవ్వుతూ అడిగింది.

"కాదు వాడి దగ్గర నుంచే సంపాదించాను మళ్ళీ."

"ఎలా?" ఆసక్తిగా అడిగింది.

"ఇవాళ బేంక్‌కి వచ్చి వంద రూపాయల నోటిచ్చి అయిదు ఇరవై రూపాయల నోట్లు చిల్లర ఇమ్మని అడిగాడు. వాడి మొహం నాకు గుర్తే వాడు నన్నే విధంగా మోసం చేశాడో అదే విధంగా వాడినీ మోసం చేశాను. వాడు నాకు ఇరవయ్యే ఇచ్చాడని బుకాయించాను. మేనేజర్ కూడా వాడిని గుర్తుపట్టారు. వాడి సంగతి తెలుసు కాబట్టి వాడు చెప్పేది నిజం అని నమ్మలేదు ఎవరూ."

"నీ చేతిలో ఇరవై పెట్టి వంద కొట్టేశాడు వాడు. నువ్వు వాడి చేతిలో ఇరవై పెట్టి వంద కొట్టేశావు అవునా?"

"అవును చెల్లుకి చెల్లు" అన్నాను.

"అయితే నువ్వుకొనే చీర చాలా కాలం గుర్తుంటుంది. నాకు చాలా జాగ్రత్తగా వాడి పదేళ్ళయినా దాస్తాను" అన్నది చెల్లాయ్ గర్వంగా.

(ఈనాడు తెలుగునాడు 1979)